నమస్తే తెలంగాణ
రాజన్న సిరిసిల్ల
5 | కరీంనగర్, శుక్రవారం 29 మార్చి 2024 | RAJANNA SIRCILLA

## పీఎఫ్‌తో కుటుంబానికి భరోసా

### ప్రావిడెంట్ ఫండ్ రీజనల్ కమిషనర్ తానయ్య

రాజన్న సిరిసిల్ల, మార్చి 28 (నమస్తే తెలంగాణ): ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్)తో ఉద్యోగికి ఎంతో మేలు జరుగుతుందని, విరమణ తర్వాత కుటుంబానికి భరోసానిస్తుందని పీఎఫ్ రీజనల్ కమిషనర్ తానయ్య పేర్కొన్నారు. ప్రైవేట్ కంపెనీల్లో పనిచేసే ఉద్యోగులంతా పీఎఫ్ కలిగి ఉండాలని సూచించారు. ఈ మేరకు సిరిసిల్లలోని అప్పారెల్ పార్కులో అంతర్జాతీయ ప్రమాణాలతో వస్త్రాలు ఉత్పత్తి చేస్తున్న గ్రీన్‌నిడిల్ కంపెనీలోని వెయ్యి మంది కార్మికులు, ఉద్యోగులకు ప్రావిడెంట్ ఫండ్‌పై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తానయ్య మాట్లాడుతూ, పరిశ్రమల యజమానులు తప్పని సరిగా తమ వద్ద పనిచేసే కార్మికులు, ఉద్యోగులను పీఎఫ్‌లో చేర్పించాలని సూచించారు. తమకు పీఎఫ్ వర్తిస్తుందా..? లేదా..? అని యజమానులను అడిగి తెలుసుకోవాల్సిన బాధ్యత కార్మికులపై ఉందన్నారు. సిరిసిల్ల జిల్లాలోని అన్ని పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికులు, బీడీ కార్మికులంతా పీఎఫ్‌లో చేరాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌పోర్స్‌మెంట్ అధికారి ఏనుగు మనోహర్‌రెడ్డి, రామచంద్రారావు, గ్రీన్‌నిడిల్ అధికారులు సాల్మన్ రాజు, హెచ్‌ఆర్ డిపార్ట్‌మెంట్ అధికారులు సల్లారి కుమార్, హెప్సీబా, హరీశ్ కార్మికులు పాల్గొన్నారు.



తంగళ్లపల్లి మండలం సారంపల్లిలో ఎండిన వరిని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్, నాయకులు

# ముంచుకొస్తున్న ముప్పు

## కరీం'నగరంలో' నీటి కటకట



నీరులేక వెలవెలబోతున్న ఎల్ఎండీ

**కరీం'నగరానికి' జలగండం పొంచి ఉన్నది. నీటి కటకట తీవ్రస్థాయికి చేరుతున్నది. మూడేండ్లలో ఎన్నడూ లేనివిధంగా ఫిబ్రవరిలోనే నుంచే పలు డివిజన్లలో కొరత ఏర్పడగా, నగర ప్రజానీకం ఇబ్బందులు పడుతున్నది. నగరానికి నీరందించేందుకు ఎల్ఎండీ రిజర్వాయరే ఆధారం కాగా, రోజురోజుకూ నీటి నిల్వలు తగ్గుముఖం పడుతుండడంతో సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతున్నది. దీంతో పలు డివిజన్లలోని కాలనీల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాల్సిన పరిస్థితి దాపురించింది. మరోవైపు నగరంలో మంచినీటి పైపులైన్ల లీకేజీలు, నీటి సరఫరా నిర్వహణపై ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా వచ్చే కొద్దిపాటి నీటికి బ్రేక్ పడుతున్నది. ఇప్పుడే ఇలా ఉంటే మండు వేసవిలో పరిస్థితి ఎలా ఉంటుందోనన్న భయం నగరవాసుల్లో వ్యక్తమవుతున్నది.**

- ఎల్ఎండీలో అంతంతే నీటి నిల్వలు
- ప్రస్తుతం రోజువిడిచి రోజు సరఫరా
- వేసవి ముదిరితే పెరుగనున్న ఎద్దడి
- వచ్చే కొద్దిపాటికి నీటికి అడ్డంకులు
- వేధిస్తున్న లీకేజీల సమస్య
- నగరవాసుల్లో ఆందోళన

కరీంనగర్ కార్పొరేషన్, మార్చి 28 : ఇంకా ఎండలు ముదరనే లేదు, కానీ, అంతట నీటి సమస్య మొదలవుతున్నది. కరీంనగర్‌లో ఇప్పటికే ప్రజల గొంతెండిపోతున్నది. నాలుగైదేండ్లుగా లేని నీటి సమస్య మళ్లీ ఇబ్బంది పెడుతున్నది. వాస్తవానికి కరీంనగరంలో ఒకప్పుడు నీటి కటకట తీవ్రంగా ఉండేది. ఎండకాలం వచ్చిందంటే చాలు ప్రజలు చాలా ఇబ్బంది పడేవారు. కానీ, కేసీఆర్ సర్కారు వచ్చిన తర్వాత ఈ సమస్య పరిష్కారమైంది. రూ.కోట్లాది నిధులతో పనులు చేపట్టి, ప్రతి రోజూ మంచినీటిని సరఫరా చేయించింది. ఎల్ఎండీలో నీటి మట్టం తగ్గినప్పుడు ఎగువన గల శ్రీరాజరాజేశ్వర జలాశయం నుంచి నీటిని విడుదల చేసి మరీ ఇబ్బందులు రాకుండా చూసింది. కానీ, ప్రస్తుతం సీన్ మారిపోయింది. ఎల్ఎండీ రిజర్వాయర్‌లో రోజు రోజుకూ నీటి నిల్వలు తగ్గుముఖం పడుతుండడంతో నగరంలో నీటి సరఫరా విషయంలో ఇబ్బందులు వస్తున్నాయి. ఫిబ్రవరి వరకు ప్రతి రోజూ మంచినీటి సరఫరా చేసిన అధికారులు, ఈ నెల మొదటి వారం నుంచే హైలెవల్ జోన్ పరిధిలోని ఆరు డివిజన్లలో రోజు విడిచి రోజు అందించారు. ఇక వారం రోజులుగా నగర వ్యాప్తంగా రోజు విడిచి రోజు సరఫరా చేస్తుండగా, ప్రజలు నీటి సంపులు, ట్యాంకులను వినియోగించే పరిస్థితి వచ్చింది. ప్రస్తుతం ఎల్ఎండీలో 5 టీఎంసీలకు పైగా నీరు ఉండగా.. నడి ఎండల వరకు నీటి సామర్థ్యం తగ్గే ప్రమాదమున్నది. ఈ పరిస్థితుల్లో తాగునీటి సరఫరాకు మరిన్ని ఇబ్బందులు వచ్చే ముప్పు కనిపిస్తున్నది.

### లీకేజీలపై దృష్టి పెట్టాల్సిందే

నగరంలో అసలే రోజు విడిచి రోజు నీటిని సరఫరా చేస్తుండగా, పైపులైన్ల లీకేజీ సమస్య వేధిస్తున్నది. దీంతో వచ్చే కొద్దిపాటి నీరు వృథాగా పోతున్నదని, వెంటనే మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఇంజినీరింగ్ ఉన్నతాధికారుల క్షేత్రస్థాయి పర్యవేక్షణలేకపోవడం, పూర్తిగా ఫిట్టర్, లైన్‌మెన్లపైనే ఆధారపడడం వల్లే ఈ సమస్య ఎక్కువైందని విమర్శిస్తున్నారు. ఇంకా నగరంలోని పలు ప్రాంతాలకు సరిపడా సరఫరా వస్తుండడం, మరికొన్ని ప్రాంతాలకు అంతంతమాత్రమే సరఫరా అవుతుండడం విమర్శలకు తావిస్తున్నది. స్వయంగా పలువురు పాలకవర్గ సభ్యులే దీనిపై మండిపడుతున్నారు. ఈ వేసవిలోనైనా ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తే నీటి కష్టాలు కొంత వరకైనా తీరుతాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### ఫిల్టర్ బెడ్‌కు సరిపడా అందని నీరు

ఫిల్టర్ బెడ్‌లో 63 ఎంఎల్‌డీ (మిలియన్ లీటర్స్ ఫర్ డే) శుద్ధి చేసే సామర్థ్యం ఉంది. ప్రస్తుతం ఎల్ఎండీలో 5 టీఎంసీల నీరు మాత్రమే ఉండడంతో రా వాటర్ తీసుకోవడానికి బూస్టర్ పంపులను వినియోగిస్తుండగా, 50 నుంచి 52 ఎంఎల్‌డీలు మాత్రమే వస్తున్నది. ఆ నీటినే ఫిల్టర్ చేసి నగరానికి సరఫరా చేస్తున్నారు. నగరానికి మంచినీటిని అందించే ఫిల్టర్ బెడ్‌లోకి సరిపడా నీరు అందడం లేదని బల్దియా ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. అయితే, ఫిల్టర్ బెడ్‌కు సరిపడా నీరందకపోవడంతో హై లెవల్ జోన్‌లో ఒక రోజు, లో లెవల్ జోన్‌లో మరొక రోజు సరఫరా చేస్తున్నారు. ఎల్ఎండీలో మరింత నీటి మట్టం తగ్గితే వచ్చే రా వాటర్‌లో మలినాలు ఎక్కువగా ఉండే ముప్పు ఉందని, దీనిని ఫిల్టర్, పంపింగ్ చేసేందుకు ఇబ్బందులు వస్తాయని చెబుతున్నారు.



ఈనెల5న కరీంనగర్‌లోని 22వ డివిజన్‌లో వాటర్‌ట్యాంకర్‌తో నీటిని పట్టుకుంటున్న ప్రజలు

# రైతన్నలూ.. అధైర్య పడొద్దు అండగా మేమున్నాం

- కాంగ్రెస్ మెడలు వంచుదాం
- పరిహారం అందేదాకా పోరాడుదాం
- మేడిగడ్డకు మరమ్మతులు చేయిస్తే ఈ దుస్థితి రాకపోయేది
- ఇది కాలం తెచ్చిన కరువు కాదు, ముమ్మాటికీ కాంగ్రెస్ తెచ్చిందే
- నష్టపోయిన పంటలకు ఎకరానికి ₹25 వేల పరిహారం ఇవ్వాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్
- సారంపల్లిలో ఎండిన పంటల పరిశీలన
- రైతులకు భరోసా

రైతన్నలూ మీరు అధైర్య పడొద్దు. మీకు అండగా కేసీఆర్, మేమున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వ మెడలు వంచి ఎండిన పంటలకు నష్టపరిహారం అందించేలా పోరాటం చేద్దాం. మేడిగడ్డ కుంగిందని సీఎం రేవంత్‌రెడ్డి మూడు నెలలుగా కాలయాపన చేస్తున్నడు. కేసీఆర్‌పై కోపంతో కాళేశ్వర జలాలు రాకుండా అడ్డుకుని దాదాపు 20 లక్షల ఎకరాలను ఎండబెట్టిండు. ప్రాజెక్టుకు మరమ్మతులు చేయించి పంటలకు నీరందిస్తే ఈ దుస్థితి వచ్చేది కాదు. ఇది కాలం తెచ్చిన కరువు కాదు, ముమ్మాటికీ కాంగ్రెస్ తెచ్చిందే. వడగండ్ల వాన, నీళ్లు లేక ఎండి నష్టపోయిన పంటలకు ఎకరానికి ₹25 వేల పరిహారం ఇవ్వాలి. వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, బోనస్ అందించాలి.

**- రైతులకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ భరోసా**

సిరిసిల్ల/సిరిసిల్ల రూరల్/సిరిసిల్ల టౌన్, మార్చి 28 : కాంగ్రెస్ సర్కారు వచ్చిన మూడు నెలల్లోనే సాగునీరు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ మండిపడ్డారు. అన్నదాతలు అధైర్యపడొద్దని, రైతుల తరపున కొట్లాడేందుకు ప్రతి గ్రామంలోని పార్టీ నాయకులు వస్తారని ధైర్యంగా ఉండాలని సూచించారు. గురువారం ఆయన జిల్లాలో పర్యటించారు. ముందుగా తంగళ్లపల్లి మండలం సారంపల్లికి మధ్యాహ్నం 12:20 గంటలకు చేరుకున్న ఆయన, ఇటీవల వడగండ్ల వానతో నష్టపోయిన పంటలను పరిశీలించి, రైతుల్లో భరోసా నింపారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు సీఎం రేవంత్‌రెడ్డి డిసెంబర్‌లో అధికారంలోకి వస్తున్నామని, రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారని, ఇప్పుడేమో రుణాలు చెల్లించాలని బ్యాంకుల ద్వారా నోటీసులు ఇస్తున్నారని, అన్నదాతల మెడపై కత్తి పెడుతున్నారని మండిపడ్డారు. రైతుబంధు కోసం తమ ప్రభుత్వం ₹7 వేల కోట్లు పంపిణీకి సిద్ధం చేస్తే సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు ఇవ్వకుండా కాంట్రాక్టర్లకు ఇచ్చి చిల్లర వ్యవహారాలకు తెరలేపారని ఆగ్రహించారు. ప్రస్తుతం రైతుల పరిస్థితి చూస్తే గోస అనిపిస్తున్నదని ఆవేదన చెందారు. సారంపల్లి రైతు పరశురాములు పదెకరాలు కౌలు కు తీసుకొని సాగుచేస్తే నీళ్లు లేక వేసిన పంట ఎండిపోయి పశువుల మేతకు మాత్రమే పనికి వస్తున్నదన్నారు. కౌలు రైతులకు రైతు భరోసా ఇస్తామని, రైతులకు రుణమాఫీ చేస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రికి కనీసం రైతులను పరామర్శించడానికి తీరికలేదని విమర్శించారు. ఎన్నికల హామీ మేరకు ₹2 లక్షల రుణమాఫీ చేయాలని, అవసరమైతే ఎన్నికల కమిషన్‌కు లేఖ రాయాలని డిమాండ్ చేశారు. రైతు భరోసా ఎకరాకు ₹15 వేలు, కౌలు రైతులకు రైతు భరోసా, కూలీలకు అందించే ₹12 వేలు ఇచ్చి హామీని నెరవేర్చాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లెల్లలోని మహిళలు కేటీఆర్‌ను కలిసి తమ భూసమస్యలు విన్నవించగా, ఆయన వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు ఫోన్ చేసి పరిష్కారించాలని సూచించారు.

### బీఆర్ఎస్‌కు అండగా నిలువాలి

**- ఇఫ్తార్ విందులో కేటీఆర్**

పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో మైనార్టీల సంక్షేమానికి కేసీఆర్ విశేష కృషి చేశారని కేటీఆర్ గుర్తు చేశారు. మైనార్టీల అభ్యున్నతి కోసం రానున్న కాలంలో బీఆర్ఎస్‌కు అండగా నిలువాలని కోరా రు. సిరిసిల్ల పట్టణంలోని షాదీఖానలో జరిగిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని మాట్లాడారు. పేద ముస్లిం యువతుల వివాహాలకు షాదీముబారక్ పథకాన్ని అమలు చేశారని తెలిపారు. కేసీఆర్ ఏనాడూ మతం పేరుమీద రాజకీయం చేయలేదని, పేదవాడు ఏ మతస్తుడైనా కావాల్సిన వసతులు కల్పించారని తెలిపారు. గత పదేండ్లలో దేశవ్యాప్తంగా మత కల్లోలాలు, అల్ల ర్లు జరిగినా తెలంగాణలో కేసీఆర్ పాలనలో మా త్రం అన్ని మతాల వారు గంగా జమునా తహజీబ్‌లా కలిసే ఉన్నారని చెప్పారు. దేశంలో అభివృద్ధి, శాంతి కావాలంటే కేసీఆర్ వంటి నేత అవసరమని చెప్పారు. కరీంనగర్ ఎంపీగా వినోద్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఆయా చోట్ల ఆయన వెంట నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు, టీపీటీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, ఎంపీపీ పడిగెల మానస, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, మాజీ జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చీటి నర్సింగరావు, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, మండలాధ్యక్షుడు గజ భీంకార్ రాజన్న, ఎంపీటీసీ గుగ్గిల్ల లావణ్య, నాయకులు ఉన్నారు.



ఇఫ్తార్ విందులో కేటీఆర్‌కు పండు తినిపిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ

# పంటలు ఎండుతున్నా పట్టించుకోరా..?

- ప్రజా సమస్యలపై రేవంత్ సర్కారు నిర్లక్ష్యం
- అనతికాలంలోనే హామీల అమలులో విఫలం
- పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్



మాట్లాడుతున్న మాజీ మంత్రి, పెద్దపల్లి బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, పక్కన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి, బాల్క సుమన్

గోదావరిఖని, మార్చి 28: 'ఓ వైపు పంటలు ఎండిపోయి రైతాంగం అల్లాడుతుంటే సీఎం రేవంత్ ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొడుతున్నరు. పాలనను గాలికొదిలి రాజకీయాల్లో మునిగితేలుతున్నరు' అంటూ పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ నిప్పులు చెరిగారు. ప్రజా సమస్యలను పక్కన పెట్టిన ఆయన బీఆర్ఎస్‌ను నామరూపాలు లేకుండా చేస్తానని ప్రగల్భాలు పలుకుతున్నారని మండిపడ్డారు. ఆరు గ్యారెంటీల పేరిట అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేస్తున్నదని విమర్శించారు. గోదావరిఖనిలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌తో కలిసి ఆయన మాట్లాడారు. కేసీఆర్ తొమ్మిదేండ్ల పాలనలో సుభిక్షంగా ఉన్న రాష్ట్రాన్ని దుర్భిక్షంగా మార్చిన ఘనత కాంగ్రెస్‌కే దక్కిందని ఎద్దేవా చేశారు. కేసీఆర్ దూరదృష్టితో వ్యవహరించి ప్రతి ఎకరాకు సాగు నీరందించారని, సమయానికి రైతుబంధు ఇచ్చారని, నిరంతరం కరెంట్ సరఫరా చేశారని చెప్పారు. కానీ 420 హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ రైతు రుణమాఫీ, రైతు భరోసా, వరికి ₹500 బోనస్, ఎకరాకు ₹25వేల నష్టపరిహారం అందించడంలో విఫలమైందన్నారు. రేవంత్ ప్రభుత్వం మరణించిన రైతుకుటుంబాలకు బీమా కూడా ఇవ్వలేని దుస్థితిలో ఉన్నదన్నారు. ఎండిన పంటలను పరిశీలించిన సందర్భంలో రైతుల బాధలు చూసి చలించిపోయానని, ఈ పరిస్థితుల్లో రైతులకు అండగా ఈ నెల 30న పెద్దపల్లిలో 36 గంటల నిరసన దీక్ష చేపడుతున్నానని తెలిపారు. రైతులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. విలేకరుల సమావేశంలో రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కౌశిక హరి, తోడేటి శంకర్‌గౌడ్, కార్పొరేటర్లు పెంట రాజేశ్, క్రిష్ణవేణి, జనగామ కవిత, సరోజని, నాయకులు నడిపెల్లి మురళీధర్‌రావు, అచ్చె వేణు, గోపు ఐలయ్య యాదవ్, బొడ్డుపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

### వందరోజులు దాటినా గ్యారెంటీల అమలేది?

అధికారం చేపట్టిన వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని కాంగ్రెస్ ఊదరగొట్టింది. కానీ, తూతూ మంత్రంగా ఒకటో రెండో అమలు చేసి చేతులు దులుపుకున్నది. హామీలు నెరవేర్చని ప్రభుత్వానికి పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుతో బుద్ధిచెప్పాలి. కేసీఆర్ పాలనలో సుభిక్షంగా ఉన్న రాష్ట్రం.. కాంగ్రెస్ హయాంలో దుర్భిక్షంగా మారింది. పంటలు ఎండుతున్నా పట్టించుకొనే నాథుడేలేడు. కష్టాల్లో ఉన్న రైతాంగానికి అండగా నిలువాల్సిన సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొడుతున్నడు. ముఖ్యమంత్రి పాలనను గాలికొదిలి ప్రశ్నించే గొంతుకైన బీఆర్ఎస్‌పై ఎదురుదాడి చేయడమే పనిగా పెట్టుకున్నడు. కేసీఆర్ పాలనలో పుష్కలంగా సాగునీరందింది. సమయానికి రైతుబంధు పడ్డది. పుష్కలంగా కరెంట్ అందింది. కానీ కాంగ్రెస్ పాలనలో రైతాంగానికి దుఃఖమే మిగిలింది. పెద్దపల్లి నుంచి బరిలో దిగుతున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని ఎన్నికల్లో ఓడించి బుద్ధి చెప్పాలి.

**- బాల్క సుమన్, చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే**

### బీజేపీని గెలిపిస్తే రిజర్వేషన్ల రద్దయితయి

పీడిత ప్రజానీకం కోసం తెలంగాణ వాదం, బహుజన వాదం ఒక్కటైంది. బీజేపీని గెలిపిస్తే ఉన్న రిజర్వేషన్లు రద్దయితయి. కొత్త రాజ్యాంగాన్ని అమల్లోకి తెచ్చి ప్రజల స్వేచ్ఛ హక్కులను హరించివేస్తుంది. మతం పేరిట ఉన్మాదంతో ఓట్లడుగుతున్న బీజేపీ అభ్యర్థిని ఓడించాలె. ఆరు గ్యారెంటీలను అమలు చేయని కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పాలె. ప్రజల గొంతుకై వస్తున్న పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ బరిలో నిలిచిన కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించుకోవాలి.

**- ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి**



ఢిల్లీలో సోనియా గాంధీకి అత్యంత సన్నిహితుడు కోల్ రోహిత్ చౌదరిని కలిసి ఊట్ల వరప్రసాద్ తరపున వినతి పత్రం అందజేస్తున్న మద్దతుదారులు

## ఒకే కుటుంబానికి ఇన్ని అవకాశాలా..?

- పెద్దపల్లి ఎంపీ టికెట్ వంశీకృష్ణకు ఎలా ఇస్తారంటూ కాంగ్రెస్‌లో చెలరేగిన సెగ
- వివేక్ కుటుంబంపై లోకల్ లీడర్ల మండిపాటు
- అభ్యర్థిని మార్చాలని అధిష్టానంపై పెరుగుతున్న ఒత్తిడి

పెద్దపల్లి, మార్చి 28 (నమస్తే తెలంగాణ): పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిగా చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ తనయుడు గడ్డం వంశీకృష్ణను ఖరారు చేయడంపై కాంగ్రెస్‌లో అసమ్మతి చెలరేగింది. బహిరంగంగానే ఆ పార్టీలోని కేడర్ విమర్శలు చేస్తున్నది. ఒక వైపు పార్టీ అధిష్టానానికి వినతి పత్రాలు ఇస్తూనే మరో వైపు బహిరంగంగా సైతం విమర్శలను ఎక్కుపెడుతున్నారు. వివేక్ కుటుంబంపై లోకల్ లీడర్లు మండి పడుతునారు. 'ఒకే కటుంబానికి ఇన్ని అవకాశాలు ఇస్తారా..? మొన్న తండ్రికి, పెద్దనాన్నకు, నేడు కొడుకుకు టికెట్లు ఇవ్వడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. పార్టీలో దళితులు లేరా..? ఏళ్ల తరబడి కష్టపడుతున్న కార్యకర్తలు ఏం కావాలి? అంటు మండిపడుతున్నారు. పార్టీలో ఎన్నో ఏళ్ల నుంచి కష్టపడుతున్న వారిని పక్కనపెట్టి.. మూడు, నాలుగు నెలల ముందు పార్టీలోకి వచ్చిన ఎమ్మెల్యే వివేక్ కుటుంబానికి అన్ని అవకాశాలు ఎలా ఇస్తారని విరుచుకు పడుతున్నారు. పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి వంశీ కృష్ణను మార్చాలని డిమాండ్ చేస్తూ సుల్తానాబాద్‌కు చెందిన యువజన కాంగ్రెస్ జాతీయ మాజీ కార్యదర్శి ఊట్ల వరప్రసాద్ ఏప్రిల్ 5న న్యాయపోరాట దీక్ష చేపడుతున్నట్టు ప్రకటించారు. అదే విధంగా గురువారం ఆయన మద్దతుదారులు మాదిగ శక్తి నాయకుడు సురేందర్ సన్నీ, కాంగ్రెస్ నాయకులు కొల్లూరి బుచ్చిబాబు, బొంగోని అనీల్‌గౌడ్‌లు ఢిల్లీలో సోనియా గాంధీ నివాసం దగ్గర ఆందోళనకు దిగారు. సోనియాకు అత్యంత సన్నిహితుడు కల్నల్ రోహిత్ చౌదరిని కలిశారు. ఇక్కడి పరిస్థితులను ఆయనకు వివరించి ఎంపీ అభ్యర్థిని మార్చాలని వినతి పత్రం సమర్పించారు. ఇక్కడి పరిస్థితులను ఆయనకు వివరించి సోనియా గాంధీకి చెప్పి ఎంపీ అభ్యర్థిని మార్చాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఊట్ల వరప్రసాద్ మాట్లాడుతూ.. వివేక్ రిజైన్ చేస్తామని బ్లాక్మెయిల్ చేసి అతని కొడుక్కు టికెట్ తెచ్చుకున్నాడని ఆరోపించారు. వివేక్ సోదరుడికి ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారని, ఆయన తనయుడికి ఇప్పుడు ఎంపీ టికెట్ ఇచ్చారని, ఇలా ఒకే కుటంబానికి మూడు అవకాశాలు ఇచ్చారని, ఇలా అయితే సామాన్య కార్యకర్త పరిస్థితి ఏంటని నిలదీశారు. ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు. ఏవిధమైన రాజకీయ అనుభవం లేని వ్యక్తికి, కేవలం మూడు నెలల క్రితం వచ్చిన వ్యక్తికి, ఎలా టికెట్ ఇచ్చారో..? కాంగ్రెస్ పెద్దలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 5న పెద్దపల్లిలో న్యాయం పోరాట దీక్ష చేపడుతున్నట్టు ప్రకటించారు.

# గంజాయి ముఠా గుట్టురట్టు

- అక్రమంగా తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్
- పట్టుబడ్డ వారిలో పదహారేండ్ల బాలుడు
- 1.5 కిలోల గంజాయి, బైక్, మూడు సెల్‌ఫోన్ల స్వాధీనం
- వివరాలు వెల్లడించిన జగిత్యాల డీఎస్పీ రఘుచందర్

రాయికల్, మార్చి 28: గంజాయి ముఠా గుట్టు రట్టయింది. అక్రమంగా తరలిస్తున్న ముగ్గురు రాయికల్‌లో పట్టుబడ్డారు. వీరిలో పదహారండ్ల బాలుడు కూడా ఉన్నాడు. వీరి వద్ద నుంచి 1.5 కిలోల గంజాయి, బైక్, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. గురువారం రాయికల్ ఠాణాలో జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ వివరాలు వెల్లడించారు. జగిత్యాలకు చెందిన కొండూరి రాజేశ్, ఆరుముళ్ల సాయికుమార్, రాయికల్‌కు చెందిన పెనుగొండ గణేశ్, మలవాత్ సతీశ్ ముఠాగా ఏర్పడి పట్టణానికి చెందిన ఓ పదహారేండ్ల బాలుడి వద్ద గంజాయిని కొనుగోలు చేసి జగిత్యాలలో యువతకు విక్రయిస్తున్నారు. వీరు గంజాయి, చోరీ కేసుల్లో నిందితులుగా ఉన్నారు. ఈ క్రమంలో కొండూరి రాజేశ్, ఆరుముళ్ల సాయికుమార్, బాలుడితో కలిసి 1.5 కిలోల గంజాయితో గురువారం బైక్‌పై రాయికల్‌కు బయల్దేరారు. ముందస్తు సమాచారం మేరకు జగిత్యాల రూరల్ సీఐ ఆరిఫ్ అలీఖాన్, రాయికల్ ఎస్ఐ అజయ్ సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుబడ్డారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. గంజాయి ముఠాను చాకచక్యంగా పట్టుకున్న రూరల్ సీఐ, రాయికల్ ఎస్ఐ కానిస్టేబుళ్లు సాగర్, ప్రశాంత్‌ను జిల్లా ఎస్పీ, డీఎస్పీ అభినందించారు.

# రైతులకు న్యాయం చేయండి

- విమర్శలు మాని సాగుకు వెంటనే నీరందించండి
- జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్



పోతారంలో పొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

సారంగాపూర్, మార్చి 28: అస్తమానం కేసీఆర్‌ను విమర్శించడం మాని రైతులకు న్యాయం చేయాలని కాంగ్రెస్ నేతలకు జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో కొంతమంది సీనియర్లు కావాలనే సీఎం రేవంత్‌రెడ్డిని తప్పుదోవ పట్టించారని, ప్రాజెక్టు దండుగ అని చెప్పి రైతులకు నీటి కష్టాలు తెచ్చిన పాపం కూడా వారిదేనని మండిపడ్డారు. ముందుగా కాళేశ్వరం ప్రాజెక్ట్‌ను పునరుద్ధరించాలని, మేడిగడ్డ వద్ద కుంగిన మూడు పిల్లర్లను బాగుచేసి సాగునీరందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం సారంగాపూర్ మండలం పోతారంలో ఎండిన పొలాలను ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. జగిత్యాల నియోజకవర్గంలో రైతులకు నష్టం జరుగుతున్నా ఇక్కడి సీనియర్ నాయకులు ఎందుకు స్పందించడం లేదో..? చెప్పాలని డిమాండ్ చేశారు. ఎస్సారెస్పీ పరిధిలో ఉన్న జగిత్యాల నియోజకవర్గంలో ఆయకట్టు పెరగడంతో 30 ఏండ్ల కిందటి నుంచే సాగునీటి సమస్యలు వచ్చినా ఎవరూ పట్టించుకోలేదన్నారు. కానీ, కేసీఆర్ సర్కారు మాత్రం కాళేశ్వరం ద్వారా నీటి కొరత లేకుండా చేసిందని, పచ్చని పంటలు పండాయని గుర్తు చేశారు. ఇప్పుడు మళ్లీ పాత కథే అయిందని, రైతులకు పెట్టుబడి సాయం అందకపోగా నేడు పెట్టిన పెట్టుబడి కూడా నష్టపోయే ప్రమాదం ఉన్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సారెస్పీ స్టేజ్1లోనే నీటి కొరత ఉంటే, మిగతా ప్రాంతాల పరిస్థితి ఎలా ఉంటదో..? అర్థం చేసుకోవచ్చన్నారు. కాంగ్రెస్ సర్కారు తీరుతో పంటలన్నీ ఎండిపోతున్నాయన్నారు. రైతులు మళ్లీ జేసీబీలు, క్రేన్‌ల సహాయంతో పూడిక తీసే రోజులు వచ్చాయన్నారు. ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీల్లో కాంగ్రెస్ ఒక్కటీ కూడా నెరవేర్చలేదని, రైతులకు పెట్టుబడి సాయం ఇవ్వలేదని, రుణమాఫీ చేయలేదన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మేడిపెల్లి మనోహర్ రెడ్డి, వైస్‌ఎంపీపీ సొల్లు సురేందర్, పార్టీ మండలాధ్యక్షుడు గుర్రాల రాజేందర్ రెడ్డి, ఎంపీటీసీ జోగిన్‌పల్లి సుధాకర్ రావు, నాయకులు ఢిల్లీ రామారావు, నర్సింహారెడ్డి, సాయిలు, మదన్‌కుమార్, తేలు రాజు, మహేశ్, శేఖర్, రైతులు రాజనర్సు, లచ్చయ్య, గంగయ్య, వెంకటి, అఖిల్, మల్లేశ్ ఉన్నారు.